శ్రీలీల జ్యువెలర్స్ ప్రారంభం



ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి చిత్రపటం బహూకరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డు వాసవీ సర్కిల్ కూడలి సాయిగోల్డ్ ప్లాజాలో బుధవారం శ్రీలీలా జ్యువెలర్స్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం యాజమాన్యం మాట్లాడుతూ తమ షోరూంలో 92.5 లగ్జరి సిల్వర్ ఆభరణాలు లభిస్తాయని వారు తెలిపారు. షోరూం యాజమాన్యం ఎమ్మెల్యేకు చిత్రపటాన్ని బహూకరించారు. టీడీపీ నాయకులు వీఎస్ ముక్తియార్, సీఎం సురేష్‌నాయుడు, స్టార్ టింబర్ అలీ, వైద్యులు నిరంజన్ రెడ్డి, కల్లూరు ప్రసాదరెడ్డి, నాగార్జున పాల్గొన్నారు.

వాచ్‌మెన్‌కు చార్జి మెమో

ప్రొద్దుటూరు : స్థానిక టూటౌన్ బైపాస్ రోడ్డులోని మున్సిపల్ పార్కులో పనిచేస్తున్న వాచ్‌మెన్ గంగాధర్ రెడ్డికి మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి బుధవారం చార్జి మెమో ఇచ్చారు. ఉదయం కమిషనర్ తన పర్యటనలో భాగంగా పార్కును సందర్శించారు. విధుల్లో వాచ్‌మెన్ లేకపోవడంతో సిబ్బందిని కమిషనర్ ప్రశ్నించారు. బుధవారం సెలవు పేరుతో విధులకు హాజరు కావడం లేదని అక్కడున్న వారు కమిషనర్‌కు తెలిపారు. బుధవారం ఎలాంటి సెలవు లేదని, అనధికారికంగా వాచ్‌మెన్ గైర్హాజరవుతున్నారని తెలుసుకున్న కమిషనర్ చార్జిమెమో ఇచ్చారు.

అమృత్ స్కీం పరిశీలన

మైలవరం డ్యాం వద్ద నిర్మించిన అమృత్ నీటి పథకాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పరిశీలించారు. సుమారు రూ.150 కోట్లతో నిర్మించిన ఈ పథకాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తి చేశారు. ఇంజినీరింగ్ అధికారులతో పాటు మెగా ప్రాజెక్టు మేనేజర్ మురళీతో కలసి పథకాన్ని పరిశీలించారు. సాంకేతిక వివరాలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా



డీఎస్పీ భక్తవత్సలం

ప్రొద్దుటూరు క్రైం : అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెడతామని డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు. ప్రొద్దుటూరు డీఎస్పీగా ఆయన బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. సెకండ్ బెటాలియన్‌లో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఆయన ఇంటెలిజెన్స్, కడప ట్రాఫిక్, కర్నూలు సీఐడీ, రాజమండ్రి ఎస్సీఎస్టీ సెల్, సెకండ్ బెటాలియన్‌డీఎస్పీగా పని చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ భక్తవత్సలం మాట్లాడుతూ సబ్‌డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూస్తానని తెలిపారు. నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీకి సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రాజుపాళెం : శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని ఎస్‌ఐ కత్తి వెంకటరమణ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా వల్లూరు నుంచి రాజుపాళెం ఎస్‌ఐగా వెంకటరమణ బదిలీ కాగా రాజుపాళెం ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ సింహాద్రిపురం మండలానికి బదిలీ అయ్యారు. వెంకటరమణ బుధవారం రాజుపాళెం ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టారు.

ప్రణాళికలతోనే పంచాయతీల అభివృద్ధి

బ్రహ్మంగారిమఠం : పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లు ప్రణాళికలతోనే పంచాయతీలను అభివృద్ధి చేయాలని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి కోరారు. బ్రహ్మంగారిమఠంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లకు నిర్వహించిన శిక్షణ తరగతులకు హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీల నిర్వహణలో సర్పంచులు, కార్యదర్శులు పరస్పర అవగాహనతో గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, వీధి లైట్ల నిర్వహణ తదితర అంశాలు పై మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు.

కాశినాయన : ప్రతి గ్రామపంచాయతీలో 2024–25 సంవత్సరానికి సంబంధించిన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను తయారు చేసుకోవాలని ఈఓపీఆర్డీ ముజఫర్‌రహీమ్ తెలిపారు. బుధవారం నరసాపురం స్త్రీశక్తి భవనంలో సర్పంచ్‌ల మూడు రోజుల శిక్షణ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ప్రణాళికతోనే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వీధిదీపాల నిర్వహణ, పంచాయతీ రాజ్ చట్టం 1994 సెక్షన్ ప్రకారం టీసీ ఛార్జీల చెల్లింపులు తదితర వివరాలను వారికి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించండి

బద్వేలు అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు చట్టసవరణ బిల్లును ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు పి.చాంద్‌బాషా పేర్కొన్నారు. వక్ఫ్ చట్టసవరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 18న గుంటూరులో జరగబోవు రాష్ట్రస్థాయి సదస్సుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవాజ్ కార్యాలయంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముస్లింలపై అనేక రకాలుగా దాడులు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే వక్ఫ్ చట్టసవరణ బిల్లును తెరమీదకు తెచ్చారని విమర్శించారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని సంజీవరాయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి భూమిపూజ చేశారు. ముందుగా ఎమ్మెల్యే ఆలయంలోకి రాగానే వేద పండితులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సంజీవరాయ, చెన్నకేశవ స్వామి ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం వరదరాజులరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సంజీవరాయ స్వామి ఆలయాన్ని అద్భుతంగా నిర్మిస్తామని చెప్పారు.

సచివాలయం తొలగించి అన్న క్యాంటిన్

ప్రొద్దుటూరు : టీబీ బంగ్లా వద్ద రూ.7.50 లక్షలతో అన్న క్యాంటిన్‌కు మరమ్మతులు చేపట్టారు. గతంలో ఉన్న మూడో వార్డు సచివాలయాన్ని తొలగించి అదే స్థానంలో క్యాంటిన్ ఏర్పాటు చేస్తున్నారు. మూడో సచివాలయాన్ని పక్కనే ఉన్న శానిటరీ డివిజన్ కార్యాలయంలోకి మార్చినట్లు కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు.

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అతిథి భోజనం



భోజనం వడ్డిస్తున్న శ్రీనివాసులరెడ్డి కుటుంబసభ్యులు

జమ్మలమడుగు : పెద్దముడియం మండలం పెద్దపసుపల గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బసిరెడ్డి శ్రీనివాసులరెడ్డి తన తల్లి బసిరెడ్డి చిన్న ఓబులమ్మ, తండ్రి రామలింగారెడ్డి జ్ఞాపకార్థం బుధవారం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు. శ్రీనివాసులరెడ్డి కుటుంబసభ్యులతో కలిసి విద్యార్థులకు భోజనం వడ్డించారు.

నివాళి

దువ్వూరు : మండలంలోని సంజీవరెడ్డిపల్లెకు చెందిన నాగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గుమ్మా నాగలక్ష్మిరెడ్డి సోదరుడు గుమ్మా నాగిరెడ్డి బెంగళూరులో గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి బుధవారం ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

అక్రమ ఇసుక రవాణాపై దాడులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు సెబ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై అధికారులు దాడులు నిర్వహించారు. రామాపురం, చౌటపల్లె, ఆర్టీపీపీ రహదారి, నంగనూరుపల్లెలో బుధవారం సెబ్ అధికారులు దాడులు చేసి ఒక టిప్పర్, మూడు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు.